క్లుప్తంగా

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్

ములుగు రూరల్: ఈ నెల 27, 28వ తేదీల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్పీ నాయకుడు మేడిపల్లి శ్యామ్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం గోవిందరావు పేట మండలం పస్రాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టే మహాధర్నను విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో పంగ శ్రీను, గడ్డం సారయ్య, నీలాల మల్లేష్, మడిపల్లి వెంకటేష్ మాదిగ, అజ్మీర సమ్మయ్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న అరెస్టు దుర్మార్గం


నిరసన తెలుపుతున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: తీన్మార్ మల్లన్నను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ అన్నారు. మల్లన్న అరెస్టును నిరసిస్తూ మల్లన్న టీం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సమస్యల మీద కొట్లాడుతూ.. లిక్కర్ స్కాం గురించి, పేపర్ లీకేజ్ గురించి మల్లన్న అనేక వార్తలు రాస్తూ ప్రజలకు అర్థమయ్యే విధంగా చెబుతున్నాడని తెలిపారు. మల్లన్నను జైల్లో పెట్టాలని దుర్బుద్ధితో 300 మంది పోలీసులతో వచ్చి మల్లన్నను, సిబ్బందిని అరెస్టు చేశారన్నారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అరెస్టులుచేసి నియంత పాలన లాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఇతర సంఘాలు, జర్నలిస్టులు మల్లన్నకు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు.

విచారణ జరిపించాలి

కాటారం: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌లో పేపర్ లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కారణంగానే పేపర్ లీకేజీ జరిగిందని ఆరోపించారు. తప్పును కప్పి పుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పని చేసే సిట్‌కు కేసును అప్పగించి కేసును నీరుగార్చడానికి ప్రయత్నం చేస్తుందని తెలిపారు. తక్షణమే కేసును సీబీఐకి అప్పగించి రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పేర్కొన్నారు. పేపర్ లీకేజీ ఘటనను బీఎస్పీ పార్టీ వెలుగులోకి తెచ్చిందని రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అమరణ నిరహార దీక్ష పోరాట ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చి నాలుగు గంటల్లో పరీక్షలను రద్దు చేసిందని తెలిన్నారు. లీకేజీ వ్యవహారంలో ఏ ఒక్కరిని వదిలిపెట్టకుండా శిక్షించాలని రాజబాబు డిమాండ్ చేశారు.

పరిహారం అందించాలి

నడికూడ: గత ఏడాది వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తెలంగాణ బీసీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంత్రులు పర్యటించి వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చిన ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో మరోసారి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఎంతో కొంత నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కిషన్‌రావు కోరారు.

ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తగదు

ఐనవోలు: పాత పెన్షన్ సాధనలో పాల్గొనే ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామనే కేంద్రం చర్యలను ఖండిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, మీడియా కన్వీనర్ చుంచుకాల లింగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణా విభాగం ఆదేశాలు ఇవ్వడాన్ని, పైగా ఆ ఆదేశాలను అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించడం అప్రజాస్వామికమన్నారు. కేంద్రం బెదిరింపు చర్యలకు పాల్గొనకుండా కేంద్ర ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాతపెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

మరిపెడ రూరల్: క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిచంద్ర అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని బుధవారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు.

షడ్రుచుల కలయిక.. ఉగాది వేడుక


వెంకటాపురం(ఎం): రామప్పలో భక్తుల పూజలు


వెంకటాపురం(కె):వేంకటేశ్వర స్వామి ఆలయంలో


ఏటూరునాగారం: రామాలయంలో..

నూతన తెలుగు సంవత్సరం ఉగాది వేడుకలను జిల్లా వ్యాప్తంగా ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని ఆరగించి, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రైతులు పంట పొలాల వద్ద అరక దున్నుతూ కొత్తసాలుకు శ్రీకారం చుట్టారు. ఇళ్లలో పిండివంటలు చేసుకుని షడ్రుచుల వేడుక ఉగాది పర్వదినం సందర్భంగా పిల్లాపెద్ద తేడా లేకుండా ఆనందంగా గడిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వెంకటాపురం(ఎం): మండల వ్యాప్తంగా తెలుగు నూతన సంవత్సరం(ఉగాది) వేడుకలు ప్రజలకు ఘనంగా జరుపుకున్నారు. రామప్ప దేవాలయంతో పాటు, పాలంపేట గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి, మండల కేంద్రంలోని రామంజనేయస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా ఆలయాల్లో అర్చకులు ఉమాశంకర్, డింగరి పురుషోత్తమాచార్యులు, రఘునాథచార్యులు పంచంగా శ్రవణం చేశారు. ప్రతి ఇంటిలో షడ్రుచులతో ఉగాది పచ్చడి, బచ్చాలు లచేసుకుని ఉగాది పండుగ వేడుకలను సంబరాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు.

పంచాంగ శ్రవణం

వెంకటాపురం(కె): మండలంలో ఉగాది పర్వదిన వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పండుగ సందర్భంగా కొందరు రైతులు ఏరువాక సాగారు. బుధవారం తెల్లవారు జాము నుంచి ఉగాది సందడి మొదలైంది. గుమ్మాలకు మామిడాకులు, వేపాకులతో తోరనాలను అందంగా అలంకరించారు. ఇంట్లో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఉగాది పచ్చడి తయారు చేశారు. సాయంత్రం ఉగాది పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం చేశారు.

రామాలయంలో..

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పంచగ శ్రవణ కార్యక్రమాన్ని అర్చకులు యల్లప్రగడ నాగేశ్వర్ రావుశర్మ చేపట్టారు. శుభకృత్‌నామ సంవత్సరంలో రాశి ఫలాలు ఏవిధంగా ఉన్నాయని భక్తులకు చదివి వినిపించారు. ఆదాయం, ఖర్చు, రాజ్యపూజ్యం, అవమానం ఇలా పలు విధాల వివరాలను నూతన పంచగం ప్రకారం వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోడెం రమేష్ దంపతులు, లాహోటి వేణుగోపాల్ దంపతులు, మాదవ్, సుగుణ, గడదాసు శివకుమార్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పందిరి పూజ


పందిరికర్రను ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన జరిగే శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఆలయంలో చలువపందిళ్లు వేసేందుకు పందిరి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు యల్లప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ పాల కర్రను తెప్పించి ప్రత్యేకంగా అలంకరించి దానిని ప్రతిష్ఠించారు. చలువ పందిర్లను ఈ రోజు నుంచి వేయనున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోడెం రమేష్, ఉపాధ్యక్షుడు గాడిచర్ల సాంబయ్య, కత్తెర శ్రీను, అలువాల శ్రీనివాస్, ఐచ్చు సత్యం, చిత్తుబోత్తుల సదానందం, బోయిలు పోతరాజు, మల్లయ్య, సత్యం పాల్గొన్నారు.

బీరన్నకు యాదవుల ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

వెంకటాపురం(ఎం): మండలంలోని పట్వారిపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వారి కుల ఆరాధ్య దైవమైన బీరన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు యాదండ్ల రవి బీరన్న దేవున్ని(పట్వారిపల్లి స్టేజ్ వద్ద తాత్కాలికంగా) ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం లేక వర్షానికి తడవడం, ఎండకు ఎండడం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ యాదవ సంఘాన్ని, తమ పరిస్థితులను ప్రత్యేకంగా గుర్తించి, బీరన్న దేవాలయానికి నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని గ్రామస్తులు వేడుకున్నారు.

ఎస్సై ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్సై

చిట్యాల: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో చిట్యాల ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించగా ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అనంతరం ఎస్సై కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో ఉండాలని మండలంలోని గౌడలు ఎల్లమ్మ తల్లిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గాజర్ల మల్లేష్, గుర్రపు తిరుపతి, గాజర్ల సమ్మయ్య, శ్రీపతి సమ్మయ్య, ఉయ్యాల రమేష్, మండ నాగరాజు, తిరుమల రాజు, బుర్ర దేవేం దర్, బుర్ర తిరుపతి, బుర్ర రాజయ్య, బుర్ర రఘు, బుర్ర రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడికి పరామర్శ

కాటారం: కాటారం మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల పాత్రికేయుడు నారమల్ల సారయ్యను బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి పరామర్శించారు. సారయ్య ఆరోగ్య పరిస్థితి, చికిత్సపై కుటుంబ సభ్యులతో ఆరా తీసి ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటిలేషన్ సౌకర్యానికి ఇబ్బందిగా ఉందని వైద్యులు వివరించడంతో నారాయణరెడ్డి వెంటనే స్పందించి హైదరాబాద్ నిమ్స్ డైరెక్టర్ బీరప్పతో ఫోన్‌లో మాట్లాడారు. నిమ్స్‌లో జాయిన్ చేసుకొని ఉన్నత వైద్యం అందించాలని కోరారు. అంబులెన్స్‌లో సారయ్యను హైదరాబాద్‌కు తరలించేలా నారాయణరెడ్డి ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రూ.5వేలు అందజేశారు. నారాయణరెడ్డి వెంట కిరణ్‌గౌడ్, శేఖర్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ టౌన్ కమిటీ ఎన్నిక


కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

మహదేవపూర్: మహదేవపూర్ టౌన్ ఎమ్మార్పీఎస్ శాఖ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేష్ మాదిగ, ఆధ్వర్యంలో టౌన్ అధ్యక్షుడుగా చింతకుంట్ల కుమార్, ఉపాధ్యక్షుడిగా చింతకుంట్ల రాము, కార్యదర్శిగా లింగాల సాగర్, ప్రధాన కార్యదర్శిగా కొయ్యల సమ్మయ్య , గ్రామ కోశాధికారిగా బెల్లంపల్లి ప్రశాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏప్రిల్ 4వ తేదీన తెలుగు రాష్ట్రాల్లో జాతీయ రహదారుల దిగ్బంధం చేయడానికి సన్నద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంథని రవితేజ, నాయకులు నల్లబూగ దర్మయ్య, లింగాల రామయ్య, సమ్మయ్య, కొలుగూరి సుమన్, తల్లపెల్లి రమేష్, చింతకుంట్ల అనిల్, సాయి, రాజాబాపు, లింగాల కోటయ్య, లింగాల ప్రభుకుమార్ పాల్గొన్నారు.

రామాలయంలో బోరు ఏర్పాటు


గొల్ల బుద్దారంలో బోరు ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామమైన గొల్ల బుద్దారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామాలయం, శివాలయంగుడిలో బోరును వేశారు. ఈకార్యక్రమానికి ఎంపీటీసీ సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై బోరును ప్రారంభించారు. ఈసందర్భంగాఆయన మట్లాడారు. రూ.లక్ష ఎంపీటీసీ నిధులతో ఈ బోర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన మహమ్మద్ ఖాజా పాషా ఇట్టి బోరుబావికి రూ.35 వేల రూపాయల విలువచేసే మోటారును గుడికి అందజేశారన్నారు.గుడినిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పక్కల మాధవి మల్లయ్య, న్యూ లంబాడి తండా సర్పంచ్ గుగులోత్ జ్యోతి మాన్సింగ్, ఆలయ నిర్మాణ కమిటీ నాయకులు కాటం తిరుపతి రెడ్డి, గోగు లక్ష్మినారాయణ, కాసర్ల దేవేందర్ రెడ్డి, వలస రవీందర్, రావిడి రవీందర్ రెడ్డి, అజ్మీరా జయపాల్, రాంబాబు, సంతోష్ , చంద్రయ్య పాల్గొన్నారు.

కేంబ్రిడ్జి పాఠశాలలో వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కాటారం: కాటారం మండల కేంద్రంలోని కేంబ్రిడ్జి హై స్కూల్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన 21 వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పదో తరగతి విద్యార్థులు తమ తల్లిదండ్రులు, గురువులకు పాద పూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ పంతకాని సమ్మయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ తాటి శ్రీనివాస్‌గౌడ్, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌రావు, కాటారం సబ్ డివిజన్ అధ్యక్షుడు కొట్టె శ్రీశైలం, మంజుల, రాజబాబు, రాజు, రాజమౌళి, షకీల్ పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాపై అధికారుల అలసత్వం

చిట్యాల: జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వండగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతుల సర్వే విషయంలో అధికారులు అలసత్వం వహించారని భారతీయ కిసాన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రాజిరెడ్డి బుధవారం ప్రకటనలో ఆరోపించారు. ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాలు, ఈదురు గాలులకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మిరప, మొక్కజొన్న, వరి, పంటల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ నష్టపోయిన పంటల సర్వేను ఒకే రోజులో పూర్తి చేయడం అధికారుల అలసత్వానికి నిదర్శమని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలలో నష్ట పోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా సర్వేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడెల సమ్మయ్య, కళ్లెపు రాజే శ్వరరావు, రాంరెడ్డి, మండల రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో విద్యుత్ సౌధ' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: తెలంగాణ విద్యుత్ సంస్థలో ఆర్టిజన్ సమస్యలు , ఇతర సమస్యల సాధనకై టీఎస్‌పీఈజేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కట్ల సదయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో చలో విద్యుత్ సౌధ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామచందర్, సంతోష్ తిప్పారపు రాజు, కందుల చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల వద్ద గ్రామస్తుల నిరసన


డబుల్ ఇళ్ల వద్ద గుమిగూడిన గ్రామస్తులు

భూపాలపల్లి అర్బన్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల కోసం భూములు కోల్పోయిన వారికి ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బాధితులు డబుల్ బెడ్ రూం ఇళ్లను ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. వేశాలపల్లి గ్రామ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు భూములు కోల్పోయారు. ఈ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని అప్పటి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్లు రైతులకు హామీ ఇచ్చారు. నిర్మాణాలు పూర్తి కావడంతో ఇటీవల మంత్రి కేటీఆర్ వాటిని ప్రారంభించారు. దీంతో తమకు కాకుండా ఇతరులకు ఇళ్ల కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు చేసిన లబ్ధిదారుల ఎంపికలో భూములు కోల్పోయిన ఏ ఒక్క కుటుంబానికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రాకపోవడంతో రైతులు కుటుంబ సభ్యులతో కలిసి ముట్టడించేందుకు వచ్చారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి వెనక్కి పంపించారు.

ఘనంగా కొండలమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే హరిప్రియ

గార్ల: మండల పరిధిలోని పినిరెడ్డిగూడెం గ్రామ సమీపంలోని కొండలమ్మ దేవాలయంలో బుధవారం వందలాది మంది భక్తులు దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి పారవశ్యం పొందారు. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రజాప్రతినిధులతో కలిసి కొండలమ్మ దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీఏటా ఉగాది పర్వదినం రోజు కొండలమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కొంగు బంగారం, కోరుకున్న కోర్కెలను తీర్చే కొండలమ్మ దేవతకు భక్తులు ప్రభబండ్లు కట్టి దేవాలమం చుట్టూ ప్రదర్శనలు చేసి జంతుబలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొండలమ్మ దేవతను దర్శించుకునేందుకు దేవాలయం ఎదుట భక్తుల సౌకర్యార్థం క్యూ కోసం బారికేడ్లు నిర్మించారు. జాతర సందర్భంగా దేవాలయం ప్రాంగణంలో రకరకాల ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి.

ఈ జాతరకు గార్ల మండలంతో పాటు, బయ్యారం , కారేపల్లి, డోర్నకల్ మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దేవాలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు చోటుచేసుకోకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై బానోత్ వెంకన్న పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఆదాయ పన్ను శాఖ కమిషనర్ లావుడియా జీవన్‌లాల్ కొండలమ్మ దేవతను దర్శించుకున్నారు. ఆయన వెంట సీఐ కాశీరాం, ఎస్సైలు బానోత్ వెంకన్న, బాదావత్ రవి, రాజ్‌కుమార్ జాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతమే లక్ష్యం

దామెర: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న మన ఊరు–మన బడి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ, కిచన్‌షెడ్ నిర్మాణం కోసం ఈజీఎస్ నుంచి రూ.37. 60 లక్షలు, టాలెట్ల నిర్మాణం, డైనింగ్ హాల్, మేజర్, మైనర్ రిపేర్లు, ఎలక్ట్రికల్ పనుల కోసం మరో రూ.23.70 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పనులు చివరి దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్ఎంసీ చైర్మన్ గోనెల సురేష్, తదితరులు ఉన్నారు.

డిపోకు నష్టం రాకుండా కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరకాల : పరకాల ఆర్టీసీ డిపోకు ఎలాంటి నష్టం కాకుండా కాపాడుకుంటామని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. గత కొంతకాలంగా డిపో ఆర్టీసీ బస్సులను తగ్గించటంపై బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ సెంటర్ కూడలిలో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. డిపోపై ఆర్టీసీ అధికారులు చేస్తున్న కుట్రలను మానుకోవాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఏసీపీ శివరామయ్యతో పాటు ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కృపాకర్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం బీఆర్ఎస్ నాయకుల ఆందోళన వద్దకు చేరుకొని శాంతింపజేశారు. ఆందోళన అనంతరం ఆర్టీసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ డిపోను ఎత్తివేస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఇతర డిపోల నుంచి పరకాల ఆర్టీసీకి ఎలాంటి నష్టం జరిగినా ఊరుకునే ప్రసక్తేలేదని అధికారులకు స్పష్టం చేసిన ఆయన డిపోకు మరిన్ని కొత్తబస్సులు తీసుకరావాలని కోరారు. ఆదాయం లేని మార్గాల్లో కొన్ని బస్సులను నిలిపివేసిన మాట నిజమేనని అన్నారు. నష్టాల బాటలో ఉండే డిపోను లాభాల బాటలోకి వెళ్లేందుకు అధికారులు, కార్మికులు ఎంతగానో శ్రమించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొత్త బస్సులు, రద్దీగా ఉండే రూట్లలో అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కృపాకర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, బండి సారంగపాణి , బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ మహోత్సవం


సీతారాములను ఊరేగిస్తున్న కమిటీ బాధ్యులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో కొలువై ఉన్న సీతారామచంద్రస్వామివారి 65వ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీసీతారామ కల్యాణోత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ భువనగిరి అనిల్‌గుప్త, కార్యదర్శి మాలె నాగేశ్వర్ రావు, కోశాధికారి నాయిని రంజిత్, భక్తులు రాములోరికి పూజలు నిర్వహించి, రథంలాగి ఊరేగింపు ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ ముఖ్య సలహాదారులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, గద్దె రవి, ఓం నారాయణలోయ, మార్నేని వెంకన్న, స్థానిక వార్డు కౌన్సిలర్ బోనగిరి గోపిరత్నం గంగధర్ నాథ్, సభ్యులు గుండా రాజశేఖర్, ఎండి ఫరీద్, యాళ్ల మురళీధర్‌రెడ్డి, మాలె శ్రవణ్‌కుమార్, వేమిశెట్టి చంద్రయ్య, చిట్యాల జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


పోచమ్మతల్లి ఆలయంలో భక్తుల సందడి

టేకుమట్ల: శోభకృత ఉగాది పర్వదిన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో భక్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోచమ్మ తల్లి ఆలయానికి చిలుకలను కట్టి, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలాల సరోత్తంరెడ్డి, ఎంపీటీసీ ఆది రఘు, ఉప సర్పంచ్ నిమ్మల స్వామి, తదితరులు పాల్గొన్నారు.